సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ముగిసిన సహకార వారోత్సవాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీలో సహకార వారోత్సవాలు సోమవారం ముగిశాయి. సొసైటీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి పి.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సొసైటీ తక్కువ సిబ్బందితో ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుని పురోగతిని కొనసాగిస్తూ సేవలు అందిస్తోందన్నారు. సహకార యూనియన్ లెక్చరర్ జి.సోమేశ్వరరావు, కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యక్షుడు కె.ఆనందకుమార్, డైరెక్టర్లు ఎం.వి.రమణ, కొండరాజు, కె.శ్రీనివాస్, బి.లాలూ, వి.జి.మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో అఖండ దీపోత్సవం



అఖండ దీపారాధనలో పాల్గొన్న సేవాసంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీ గౌరీ సేవా సంఘం నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం ఆధ్వర్యంలో సీఎంఆర్ కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న మహోత్సవాల సందర్భంగా సాయంత్రం అఖండ దీపోత్సవం నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షుడు దాడి వెంకటరమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమంతో ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే, ఉద్యమం ద్వారా ప్రైవేటీకరణను అడ్డుకుని తీరుతామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1012వ రోజు సోమవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

'జీవో 114 అమలు చేయాలి'

గాజువాక : జీవీఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడానికి ఉద్దేశించిన జీవో 114ను అమలు చేయాలని కోరుతూ కార్మికులు సోమవారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ఈ అంశంపై జోనల్ కమిషనర్ పి.సింహాచలానికి వినతి పత్రం అందజేశారు. జీవీఎంసీ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యదర్శి గొలగాని అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

అప్పికొండ సోమేశ్వరాలయం వద్ద వెలుగులోకి మెట్లు



పైప్‌లైన్ వద్ద బయల్పడిన మెట్లు

పెదగంట్యాడ : జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం మూడు మెట్లు వెలుగుచూశాయి. ఆలయ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఆలయం పక్కన, అప్పికొండ తీరానికి వెళ్లే రోడ్డుకు ఆనుకొని పైప్‌లైన్ ఉంది. ఆ పైప్‌లైన్ లీక్ కావడంతో మరమ్మతుల నిమిత్తం స్థానికులు చిన్న గొయ్యి తవ్వారు. ఈ నేపథ్యంలో ముందుగా ఒక మెట్టు కనిపించింది.. తర్వాత మరొకటి.. ఆపై ఇంకొక మెట్టు దర్శనమివ్వడంతో వారంతా అవాక్కయ్యారు. వెంటనే దేవదాయ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత అక్కడికి చేరుకుని తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ మూడు మెట్లు కనిపించడంతో స్పందించిన ఆమె ఎండోమెంట్‌తోపాటు పురావస్తు శాఖాధికారులతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం అప్పికొండ సోమేశ్వరస్వామిని ఆమెను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు చదువుల నాగరాజు, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఈవో జగన్నాథం, కె.శివకుమార్ పాల్గొన్నారు.

నాడు — చిన్న సుస్తీ చేసినా గంగవరం వాసులు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిముక్కులోని పెదగంట్యాడ పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. అక్కడా అవసరమైన సదుపాయాలు లేకపోతే ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదించాల్సిన పరిస్థితి

నేడు — అధునాతన వసతులతో గంగవరంలోనే ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. సాధారణ వైద్యునితో పాటు ప్రతీ రోజూ ఓ స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. అవసరమైన వైద్య పరీక్షలన్నీ ఆస్పత్రిలోనే చేస్తున్నారు. పేదలకు నాణ్యమైన వైద్యానికి భరోసా దక్కింది.





పేదల వైద్యానికి భరోసా



- గంగవరంలో కార్పొరేట్ స్థాయిలో యూపీహెచ్‌సీ
- ప్రతీ రోజు స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

పెదగంట్యాడ: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయి. అందులో భాగంగా 64వ వార్డు గంగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీలో ఓపీ సేవలు, వైద్య సేవలు చాలా బాగా ఉన్నాయని రోగులు చెబుతున్నారు. వైద్యులు నిత్యం అందుబాటులో ఉండటం, సేవలు బాగుండడంతో రోజూ 100 వరకు ఓపీ నమోదవుతోంది. ఇక్కడే ఆరోగ్య శ్రీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పరీక్షలన్నీ ఇక్కడే..

యూపీహెచ్‌సీలో అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించడంతో ఇక్కడే అన్ని పరీక్షలు చేస్తున్నారు. బయో కెమిస్ట్రీ యంత్రం ద్వారా 18 రకాలు, సీబీసీ ద్వారా 10 రకాల పరీక్షలు, ఈఎస్సార్ ద్వారా రెండు, ఎలక్ట్రోలైట్ ద్వారా రెండు రకాల పరీక్షలు చేస్తున్నారు. రోగులకు డెంగ్యూ, యూరిన్, బ్లడ్ గ్రూప్, సుగర్, హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేసి, అక్కడే రిపోర్టులు ఇస్తున్నారు. దాని ప్రకారం రోగులకు వైద్య చికిత్స అందజేస్తున్నారు.

అందుతున్న సేవలు

కుక్కకాటు ఇంజెక్షన్లు, పాము కాటు మందు, తల్లులకు 64 రకాల పరీక్షలు, లివర్ ఫంక్షన్ టెస్టులు, కిడ్నీ ఫంక్షన్ టెస్టులు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ టెస్టులు, డెంగ్యూ, మలేరియా టెస్టులు, గర్భిణులకు ప్రత్యేక సేవలు, పిల్లలకు 13 రకాల వ్యాక్సిన్లు, రక్తం తక్కువ ఉన్నవారికి ఐరన్ ఇంజెక్షన్లు, గర్భిణులకు ఎనిమీయా రాకుండా వ్యాక్సిన్లు, టీబీ, బోదకాలు మందులు అందజేస్తున్నారు. ప్రతీ గురువారం జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లి 6 నుంచి 10 వరకు విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షించి, మందులు అందిస్తున్నారు.

వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రాంతం	:	64వ వార్డు, గంగవరం
నిర్మాణ వ్యయం	:	రూ.1.15కోట్లు
వసతులు	:	8 గదులు 10 పడకలు అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్ బయో కెమిస్ట్రీ యంత్రం సీబీసీ, ఎలక్ట్రోలైట్
మందులు	:	167 రకాలు
ఓపీ సమయం	:	ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు
ఓపీ సంఖ్య	:	రోజూ 90 - 100 మంది
వైద్యాధికారి	:	డాక్టర్ వినయ్‌కుమార్
స్పెషలిస్టులు	:	సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో స్పెషలిస్టు

నాకు పునర్జన్మనిచ్చారు



నేను ఒక రోజు ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు పొయ్యిలో పడిపోవడంతో శరీరమంతా కాలిపోయింది. బొబ్బలొచ్చేశాయి. వెంటనే యూపీహెచ్‌సీకి వెళ్లాను. డాక్టర్ గారు వెంటనే వైద్యం ప్రారంభించారు. 15 రోజుల పాటు చికిత్స చేశారు. ఆస్పత్రిలోని మందులే కాకుండా ఇతర ఆస్పత్రుల నుంచి మందులు తీసుకువచ్చి అందించారు. అన్నీ ఉచితంగా ఇచ్చారు. 15 రోజుల్లోనే కోలుకున్నాను. పునర్జన్మ అనిపించింది. వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు. **– అమ్మోరు**, గంగవరం

వైద్య సేవలు బాగున్నాయి



గంగవరంలోని కొత్త ఆస్పత్రిలో సేవలు బాగున్నాయి. రోగులను మంచిగా పలకరిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు వివరంగా తెలుసుకుంటున్నారు. అవసరమైన చికిత్సలు చేస్తున్నారు. మంచి మందులు ఇస్తున్నారు. నేను తరచూ సుగర్, బీపీ చెక్ చేయించుకుని మందులు తీసుకుంటున్నాను.

– బడి తోటయ్య, గంగవరం



అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్



వైద్య పరీక్షల కోసం అత్యాధునిక ఎక్విప్‌మెంట్

స్పెషలిస్ట్ డాక్టర్ల ఓపీ

సాధారణ వైద్యపరీక్షలతో పాటు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతీ రోజు స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారు.

సోమవారం	:	ఈఎన్‌టీ
మంగళవారం	:	గైనకాలజీ
బుధవారం	:	జనరల్ సర్జరీ
గురువారం	:	జనరల్ మెడిసిన్
శుక్రవారం	:	ఆర్థోపెడిక్
శనివారం	:	డెర్మటాలజీ

దగ్గర్లోనే ఆస్పత్రి



గతంలో సుస్తీ చేస్తే నెల్లిముక్కు వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు దగ్గర్లోనే ఆస్పత్రి కట్టాక చాలా సౌకర్యంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రి అయినా ఇక్కడ అన్ని సదుపాయాలు ఉన్నాయి. డాక్టర్లు బాగా చూస్తున్నారు. అవసరమైతే రక్తపరీక్షలు కూడా ఇక్కడే చేస్తున్నారు. ఒంట్లో ఏమాత్రం బాగా లేకపోయినా మళ్లీ రమ్మని చెబుతున్నారు. మంచి వైద్యసేవలు అందుతున్నాయి. **– పేర్ల రాజమ్మ**, గంగవరం

రోజూ 90 మందికి పైగా..



ప్రతి రోజూ 90 నుంచి 100 మంది వరకూ రోగులు వస్తున్నారు. ఎమర్జెన్సీ అయితే అగనంపూడి గానీ, కేజీహెచ్‌కు గానీ రిఫర్ చేస్తున్నాం. ఇక్కడ మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. ఇక్కడ మందులు లేకపోతే వేరే ఆస్పత్రులకు వెళ్లి తీసుకువచ్చి మరీ రోగులకు ఇస్తున్నాం. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– డాక్టర్ వినయ్ కుమార్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

పెదగంట్యాడ: రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అన్నారు. జీవీఎంసీ 72, 73 వార్డు లకు సంబంధించి పెదగంట్యాడ సచివాలయం–3 ఆవరణలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రూ.10కోట్ల 76 లక్షల,46 వేల 221 రూపాయలతో చేపట్టిన సంక్షేమ పథకాలను తెలియజేసేలా డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సచివాలయాల పరిధిలో 1306 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ వివరాలను ప్రకటించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ 72వ వార్డు అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్‌గౌడ్, ఆలీ, కుమార్ సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



73వ వార్డు సచివాలయం-3లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సుజాత, వెంకటరావు

76వ వార్డు నడుపూరులో..

ఒక పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుండేలా నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను అన్నారు. వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో నడుపూరు గాంధీ పార్కు వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, పరంకుశం ప్రమీల, సూర్యనారాయణ, కాకినాడ పెంటారావు, గొంప రమేష్ పాల్గొన్నారు.



76వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను

మహాదేవా.. మనసా స్మరామి

- పంచాక్షరితో ప్రతిధ్వనించిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



అక్కిరెడ్డిపాలెంలో పూజలందుకుంటున్న ఉమారామలింగేశ్వరుడు

గాజువాక: కార్తీక మాసం తొలి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. శైవక్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. వినాయకనగర్ వుడాకాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయంలో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని దేవాదాయ శాఖ అధికారులు వసతులను సమకూర్చారు.

స్టీల్‌ప్లాంట్ శివాలయాల్లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. సెక్టర్–6 శివాలయానికి భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో బయట వరకు బారులు తీరారు. బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుత్వికుల ఆధ్వర్యంలో హోమాలు చేశారు.

- రవీరేస్ సమీప పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక త్రిశక్తి దేవాలయంలో సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో జ్యోతిర్లింగార్చన చేశారు. భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

అక్కిరెడ్డిపాలెం: స్థానిక ఉమారామలింగేశ్వరాలయం, 69వ వార్డులోని కాశీవిశ్వేశ్వరాలయం, ఆటోనగర్‌లోని నాగలింగేశ్వరాలయం, రాంనగర్‌లోని ఉమా రామలింగేశ్వరాలయాలకు భక్తులు పోటెత్తారు.



ఉక్కు త్రిశక్తి దేవాలయంలో జ్యోతిర్లింగార్చన




పూజల్లో పాల్గొన్న భక్తులు



కణితి రోడ్‌లోని ఏకాంబరాలయంలో భక్తుల రద్దీ

సత్యసాయి సేవాసమితి వితరణ

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సేవా దినోత్సవం నిర్వహించారు. సత్యసాయి 98వ జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవా సమితి దత్తత గ్రామం ఎలమంచిలి దొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, ఈశ్వరపు పాలెం గవర్నమెంట్ బోర్డు స్కూలు బాలబాలికలకు వైట్ యూనిఫారాలు, లడ్డూలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులు కూర్చునేందుకు వీలుగా ఐరన్ బెంచీలు, బాలింతల అవసరాలకు బెంచీలు అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి ప్రతినిధులు జి.రామకృష్ణ, సలాది విష్ణుమూర్తి, పద్మ, కె.వి.ఎస్. జోగారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఐరన్ బెంచీలు అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

కల్లు గీత కార్మికుల సమస్యలపై వినతి



జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పారావు, లక్ష్మి

పెదగంట్యాడ: కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యాత శెట్టిబలిజ గౌడ ఈడిగ శ్రీశయిన సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు కోరారు. ఈ మేరకు నగరంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో సోమవారం నిర్వహించిన కులగణన ప్రాంతీయ సదస్సులో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చెట్లపై నుంచి పడిపోయి మృతి చెందిన వారిని, గాయపడిన వారిని ఆర్థికంగా ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో అండిబోయిన లక్ష్మి, అంగటి రాము పాల్గొన్నారు.

సేవియర్ చర్చిలో విమన్ క్రిస్మస్



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం: ఆశ్రమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం విమన్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. స్థానిక సెక్టార్ –8లోని ది క్రైస్ట్ ది సేవియర్ చర్చిలో మినిస్ట్రీస్ కో–ఫౌండర్ బీట్రిస్ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో 37 చర్చిలకు చెందిన సుమారు 300 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసుక్రీస్తు పుట్టుక గురించి గాబ్రియేలు అనే ప్రధాన దూత ద్వారా తెలియజేసిన శుభ వర్తమానమును స్కిట్ రూపంలో అభినయించారు. బీట్రిస్ మనోహర్ మహిళలకు బహుమతులు అందజేశారు. పాస్టర్ పీటర్ మనోహర్, కార్యదర్శి డి.జాన్సన్, అధ్యక్షుడు బి.మోనాన్, స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ జీఎం ఎస్.భాను తదితరులు పాల్గొన్నారు.

ఎంత టెక్నాలజీ వచ్చినా పుస్తకానికే ప్రాధాన్యం

- గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అద్దంకి రాఘవాచార్యులు

గాజువాక: టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పుస్తకం ప్రాధాన్యత, విలువ తగ్గదని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల విజేతలకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాలు ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన విజ్ఞాన భాండాగారాలన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో సునీత , 67వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, పౌర హక్కుల సంఘం నాయకుడు తుంపాల శ్రీరామ్మూర్తి, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెడ్సీ సింహాచలం

విజేతలకు బహుమతులు

పెదగంట్యాడ: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 19 వరకు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు, ఎంఈవో శ్రీనివాస్, నడుపూరు హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు ఏఐటీయూసీ కృషి

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో కార్మికుల శ్రేయస్సుకు ఏఐటీయూసీ (యునైటెడ్ ఫ్రంట్) కృషి చేస్తోందని యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎ.కె.దాసు అన్నారు. గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా టౌన్‌షిప్‌లోని కళాభారతి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. సంస్థలో కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్రంట్ అడ్వైజర్ ఎస్.డి.వి.కృష్ణంరాజు, ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహూ, డీఈయూ ప్రధాన కార్యదర్శి టి.ఎల్.నర్సింగరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్.రాజు, వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి జి.రామచంద్రరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న భెల్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు దాసు

'మోదీ దుశ్చర్యలను అడ్డుకుంటాం'

గాజువాక : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ.జె.స్టాలిన్ అన్నారు. ప్రజల ఆస్తులను తన కార్పొరేట్ మిత్రులకు సొంతం చేయడానికి ప్రయత్నిస్తున్న ఆయన దుశ్చర్యలను అడ్డుకుంటామన్నారు. గాజువాకలో సోమవారం నిర్వహించిన వామపక్ష కార్మిక సంఘాల సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను విక్రయించాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నాను నిర్వహించనున్నామన్నారు. స్టీల్ ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్ మాట్లాడుతూ కార్మికుల ఉద్యమాల ద్వారా కేంద్రాన్ని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు అచ్యుతరావు, ఆర్‌కేవీ కుమార్, మల్లయ్య, కేఎం శ్రీనివాస్, శంకరరావు, భద్రం, రామునాయుడు, నాని బాబు, విల్లా రామ్మోహనకుమార్, కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజబాబు, బూసి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో నాయకుల సంఘీభావం

27, 28 తేదీల్లో కార్మిక, కర్షక మహాధర్నా

ఉక్కునగరం: అఖిలపక్ష కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడారు. డిసెంబర్‌లో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ అంశాన్ని లేవనెత్తడానికి పోరాట కమిటీ నాయకులు ఢిల్లీ వెళ్లి ఎంపీలను కలవాలని నిర్ణయించారు. నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కె.దాలినాయుడు, టి.జగదీష్ , గణపతిరెడ్డి, రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.